

కంపెనీల దురాగతం.. బర్లీ రైతులకు ధరాఘాతం

బర్లీ పొగాకు కొనేవారు లేక నిల్వలు పేరుకు పోయి రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

- 8లో..



ప్రలోభాల పర్వం.. ఆపై అవిశ్వాసం

మార్కాపురం మున్సిపల్ చైర్మన్ గిరిపై పచ్చ కుట్రలు మొదలయ్యాయి. అవిశ్వాసం పేరుతో కొత్త నాటకానికి కూటమి నేతలు తెరతీశారు.

- 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
41.3 /29.6

వాతావరణం

పగటి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది. ఉక్కపోతగా ఉంటుంది. గాలిలో తేమశాతం అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

ఒంగోలు సిటీ: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. ఉదయం మొదటి సంవత్సరం విద్యార్థులకు సెకండ్ లాంగ్వేజ్ పేపర్–1, మధ్యాహ్నం రెండో సంవత్సరం విద్యార్థులకు సెకండ్ లాంగ్వేజ్ పేపర్–2 పరీక్షలు నిర్వహించినట్లు ఆర్ఐఓ సైమన్ విక్టర్ తెలిపారు. మొదటి సంవత్సరం విద్యార్థులు 46 కేంద్రాల్లో జనరల్ 4,048 మందికిగానూ 3,686 మంది హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 200 మందికిగానూ 177 మంది హాజరయ్యారు. ఒక మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రెండో సంవత్సరం విద్యార్థులు 27 పరీక్ష కేంద్రాల్లో జనరల్ కింద 646 మందికిగానూ 572 మంది హాజరుకాగా, 74 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 108 మందికిగానూ, 90 మంది హాజరుకాగా, 18 మంది గైర్హాజరయ్యారు.

ఒంగోలు తాలూకా సీఐగా విజయకృష్ణ



ఒంగోలు టౌన్: ఒంగోలు తాలూకా పోలీస్ స్టేషన్ సీఐగా విజయకృష్ణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. పల్నాడు జిల్లాలో ఐటీ కోర్‌లో పనిచేస్తూ బదిలీపై వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న అజయ్ కుమార్‌ను వీఆర్‌కు పంపించడంతో ఆయన స్థానంలో విజయకృష్ణ బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో ఒంగోలు సీసీఎస్‌లో పనిచేశారు. టీడీపీ నాయకుడు వీరయ్య చౌదరి హత్య కేసుకు సంబంధించిన వైఫల్యాలపై అజయ్‌కుమార్‌ను వీఆర్‌కు పంపించినట్లు సమాచారం.

ఆశలు నీరుగారి.. ఆశావహులు రగిలి!



అధికార కూటమిలో నామినేటెడ్ పదవుల కాక ఓ రేంజ్‌లో సాగుతోంది. పైకి అంతా బాగానే ఉందని ఆ పార్టీ నేతలు చెబుతున్నా.. అంతర్గతంగా మూడు పార్టీల నేతలు రగిలిపోతున్నారు. క్షేత్రస్థాయిలో టీడీపీ కోసం పనిచేసిన వారికి పదవులు దక్కడం లేదని పలువురు నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక జనసేనకు మొక్కుబడిగా ఒక పదవి దక్కగా, కమలనాథులకు సరైన ప్రాధాన్యం దక్కడం లేదన్న అసంతృప్తిని ఆ పార్టీ నాయకులు వ్యక్తం చేస్తున్నారు. ఇదేం మిత్ర ధర్మమంటూ మండిపడుతున్నారు. ఆదివారం ప్రకటించిన నామినేటెడ్ పదవులు కూటమికి కొత్త తలనొప్పులు తెచ్చిపెట్టాయన్న ప్రచారం జరుగుతోంది.

- అధికార కూటమిలో నామినేటెడ్ సెగలు
- పది నెలలుగా పదవులపై ఆశలు
- ఇంకా పెండింగ్‌లో కీలక పదవులు
- ఒడా చైర్మన్‌పై పంతాలకు పోతున్న నాయకులు
- స్థానికంగా సంబంధాలు లేనివారికి పదవులు
- మరింత చిచ్చురాజేసిన జనసేన
- బీజేపీలోనూ వినిపిస్తున్న అసంతృప్తి రాగాలు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

విడతలవారీగా భర్తీ అవుతున్న నామినేటెడ్ పదవులపై అధికార కూటమిలో ఆశావహులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ పదవులను భర్తీ చేస్తారని అంతా భావించారు. 10 నెలలు గడుస్తున్నా అప్పుడో పదవి, ఇప్పుడో పదవి అంటూ ప్రకటిస్తుండటంతో టీడీపీ నేతలు అసహనానికి గురవుతున్నారు. గత ఎన్నికల సమయంలో పదవుల ఆశ పెట్టి కొంత మంది నాయకులను బాగానే వాడుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఎన్నికలైపోయాక వారికి ఒట్టి చేతులు చూపడంతో అగ్గిమీద గుగ్గిలంలా మండిపడుతున్నట్లు సమాచారం. జిల్లాకు సంబంధించి ఇంకా కీలక పదవుల భర్తీ పెండింగ్‌లో ఉండటంపై నిరసనలు వ్యక్తమవుతున్నాయి.

వీరివీరి గుమ్మడిపండు..

ఒడా పదవి ఎవరికి...

కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే జిల్లా నాయకులంతా ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (ఒడా) చైర్మన్ పదవి కోసం తీవ్రంగా ప్రయత్నాలు మొదలుపెట్టారు. టీడీపీ నాయకులు అరడజను మందితోపాటు జనసేన నాయకులు కూడా ఈ పదవి కోసం పోటీపడ్డారు. టీడీపీలోని కీలకమైన మహిళా నాయకురాలు కూడా ఈ పదవి కోసం విశ్వ ప్రయత్నాలు చేసినట్లు సమాచారం. ఇదిలా ఉండగా, ఈ పదవిని జనసేన నాయకులకు ఇచ్చేది లేదని మంత్రి నారా లోకేష్ స్పష్టం చేసినట్లు వార్తలు వచ్చాయి. ఈ పదవిని ఓ మాజీ ఎమ్మెల్యేకు ఇచ్చేందుకు ఆయన సుముఖంగా ఉన్నట్టు తెలుస్తోంది. దాదాపు అతని పేరు ఖరారయ్యే సమయంలో సదరు నాయకురాలు తనకు సన్నిహితంగా ఉండే మంత్రి ద్వారా దాదాపు అడ్డుకున్నట్టు తెలిసింది. ఎన్నికల్లో పార్టీ విజయం కోసం ప్రయత్నించిన నాయకులు తగిన గుర్తింపులేదని పార్టీ కార్యక్రమాలకు సైతం దూరంగా ఉంటున్నట్లు సమాచారం.

పీడీసీసీ పదవిపై అసంతృప్తి..

పీడీసీసీ పదవికి డాక్టర్ కామేపల్లి సీతారామయ్య పేరు ప్రకటించడంతో టీడీపీలో తీవ్రస్థాయిలో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ పదవి కోసం పచ్చ తమ్ముళ్ల మధ్య పోటాపోటీ నెలకొనడంతో ప్రకటించకుండా పెండింగ్‌లో పెడుతూ వచ్చారు. ఇటీవల హత్యకు గురైన వీరయ్య చౌదరి పోటీ పడినట్లు ప్రచారం. పార్టీ అధిష్ఠానం వీరయ్య పేరును ఖరారు చేసిందని, అయితే ఊహించని విధంగా వీరయ్య దారుణ హత్యకు గురవడంతో కామేపల్లికి లైన్ క్లియర్ అయినట్లు చెప్పుకుంటున్నారు. ఈ పదవి కోసం దర్శి నియోజకవర్గం నుంచి కూడా ఓ నేత తీవ్రంగా ప్రయత్నించారు. సదరు నాయకుడికి మద్దతుగా జిల్లాకు చెందిన ఐదుగురు ఎమ్మెల్యేలు, ఒక మంత్రి దగ్గర నుంచి సిఫార్సు లేఖలు ఇచ్చినట్లు తెలిసింది. ఇతర నియోజకవర్గాల నుంచి సైతం నాయకులు ప్రయత్నాలు చేసినప్పటికీ పదవి దక్కకపోవడంతో తమకు మొండిచేయి చూపించారని మండిపడుతున్నట్లు సమాచారం. కీలకమైన పదవులను ఒకే సామాజికవర్గానికి మాత్రమే కట్టబెడుతున్నారని కూటమి నాయకులు ఆరోపిస్తున్నారు.

జనసేన గ్రూపుల్లో రాజుకున్న అసంతృప్తి...

జిల్లా జనసేనలో మొదట్నుంచి రెండు గ్రూపులున్నాయి. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్‌కు ఆంధ్రప్రదేశ్ లైవ్‌స్టాక్ డెవలప్మెంట్ ఏజెన్సీ చైర్మన్ పదవి ఇవ్వడంతో జనసేనలోని ప్రత్యర్థి గ్రూపులు మండిపడుతున్నట్లు సమాచారం. ఆయనకు వ్యతిరేకంగా ఉన్న వర్గాలు సైతం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు సమాచారం.

రగిలిపోతున్న ఇతర సామాజిక వర్గాలు...

టీడీపీలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ నాయకులు అసంతృప్తితో రగిలిపోతున్నట్లు సమాచారం. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కంభం మార్కెట్ యార్డు పదవి, సహకార బ్యాంకు పదవులను ముస్లింలకు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు మాత్రం ముస్లింలకు ఎలాంటి పదవులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని వాపోతున్నారు. జిల్లాలో మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్, హజ్ కమిటీలను కూడా భర్తీ చేయకుండా ఉద్దేశపూర్వకంగా కాలయాపన చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. అలాగే గత ప్రభుత్వ హయాంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ పదవిని కుప్పం ప్రసాద్‌కు ఇచ్చారు. ఈ పదవిపై పొదిలికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడైన గుణిపూడి భాస్కర్ ఆశలు పెట్టుకున్నారు. కానీ, ఆయనను పూర్తిగా పక్కన పెట్టారు. అలాగే పార్టీ ఆవిర్భావం నుంచి పనిచేస్తున్న మార్కాపురానికి చెందిన ఓ నాయకుడికి కూడా ఎలాంటి పదవి ఇవ్వకుండా పక్కన పెట్టేశారు. పార్టీలో సీనియర్లకు విలువలేదని కొందరు నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కులం, డబ్బుకు ప్రాధాన్యత ఇస్తున్నారని, పార్టీ కోసం పనిచేసిన వారిని పట్టించుకోవడం లేదన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

ఒకరు విజయవాడ.. మరొకరు హైదరాబాద్...

తొలివిడత నామినేటెడ్ పదవుల పందేరంలో బీజేపీకి చెందిన లంకా దినకర్‌కు 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్‌గా ఇచ్చారు. ఒంగోలుకు చెందిన ఆయన విజయవాడకు మకాం మార్చి చాలా రోజులైంది. అలాగే అవినీతి కేసులో అరెస్టయిన చంద్రబాబుకు మద్దతుగా హైదరాబాద్ ఐటీ ఉద్యోగులతో సమ్మెలు చేయించినందుకుగానూ భూమి ఫౌండేషన్ నిర్వాహకురాలు పొడపాటి తేజస్వీకి సాంస్కృతిక విభాగం చైర్‌పర్సన్ పదవి ఇవ్వడం టీడీపీలో చర్చనీయాంశమైంది. తేజస్వీ ఒంగోలు వాసే అయినప్పటికీ ఎప్పటి నుంచో హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. వీరిద్దరికి తొలివిడతలోనే పదవులు దక్కాయి. స్థానికంగా ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీ కోసం పనిచేసిన వారికి మాత్రం మొండిచేయి చూపారని తమ్ముళ్లు గరం గరంగా ఉన్నారు. అలాగే నామినేటెడ్ పదవుల విషయంలో తమను ఏమాత్రం పట్టించుకోవడం లేదని కమలనాథులు కుమిలిపోతున్నారు. జిల్లా కోటా నుంచి లంకా దినకర్‌కు పదవి ఇచ్చినప్పటికీ ఆయనకు స్థానిక బీజేపీతో ఎలాంటి అనుబంధంగానీ సంబంధంగానీ లేదని చెబుతున్నారు. నామినేటెడ్ పదవుల్లో తమను పరిగణనలోకి తీసుకోవడం లేదని కమలనాథులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్టు తెలుస్తోంది.

మొత్తం పొగాకు కొనుగోలు చేస్తాం

- టుబాకో బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్

ఒంగోలు సబర్బన్: ప్రతి ఏటా పొగాకు మొత్తాన్ని కొనుగోలు చేసేలా బోర్డ్ పర్యవేక్షిస్తున్నట్లు పొగాకు బోర్డ్ చైర్మన్ యశ్వంత్ కుమార్ తెలిపారు. రాష్ట్ర మంత్రులు, జిల్లాలోని ప్రజాప్రతినిధుల సమక్షంలో సోమవారం ఒంగోలులోని కలెక్టరేట్‌లో మీ కోసం భవన్‌లో పొగాకు కొనుగోలు కంపెనీల ప్రతినిధులు, రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో 167 మిలియన్ కిలోల పొగాకు ఉత్పత్తికి అనుమతివ్వగా 240 మిలియన్ కిలోల ఉత్పత్తి వచ్చినట్లు తెలిపారు. ఈ మొత్తాన్ని కొనుగోలు చేయించేలా ప్రయత్నిస్తామని ఆయన ప్రకటించారు. మన దేశంలో 80 మిలియన్ కిలోలు, ఇతర దేశాలలో 400 మిలియన్ కిలోల అధిక ఉత్పత్తి రావడం వలన అంతర్జాతీయంగా ధరలు తక్కువగా ఉన్నాయన్నారు. ఈ నెలాఖరుకు మార్కెట్ పుంజుకునే అవకాశం ఉందన్నారు. కష్టకాలంలో రైతులను ఆదుకునే బాధ్యత పొగాకు కొనుగోలు కంపెనీలపై ఉందని రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా కొనుగోళ్లు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. మరో మంత్రి బాలవీరాంజనేయస్వామి మాట్లాడుతూ హైగ్రేడ్‌తో పాటు మీడియం, లోగ్రేడ్ పొగాకు కూడా కొనుగోలు చేయాలని చెప్పారు. ప్రస్తుత పరిస్థితులలో మార్క్‌ఫెడ్ జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితి లేదన్నారు. ప్రస్తుతం పొగాకు ధరల్లో సంక్షోభం ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించాలని ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు డిమాండ్ చేశారు. పొగాకు రైతులు నష్టపోయి ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు ఉత్పన్నమవుతాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పొగాకు ధరలు సంక్షోభంలో ఉన్నప్పుడు మార్క్‌ఫెడ్‌ను రంగంలో దించడంతో వ్యాపారులు పోటీపడి మరీ పొగాకు కొనుగోలు చేశారని గుర్తు చేశారు. లోగ్రేడ్ పొగాకును కొనుగోలు చేయకపోవడం వలన రైతులు పలు మార్లు కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారని, దీని వలన రవాణా ఖర్చులతో పాటు కొంత పొగాకు కూడా నష్టపోవాల్సి వస్తుందని చెప్పారు. సమావేశంలో పొగాకు బోర్డు ఈడీ విశ్వశ్రీ, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పైన పటారం.. లోన లొటారం..!

లక్ష్యం మేరకు జిల్లాలో ఎక్కడా పనులు జరగడం లేదు. ఏదీ సక్రమంగా అమలు కావడం లేదు. ప్రజలకు అవసరమైన పనులేమీ చేయడం లేదు. కానీ, అంతా అద్భుతంగా చేస్తున్నట్లు అటు ప్రజాప్రతినిధులు.. ఇటు అధికారులు ఏడాది కాలంగా డప్పుకొట్టుకుంటూ వస్తున్నారు. ఇదంతా జిల్లా సమీక్ష కమిటీ సమావేశం సాక్షిగా బయటపడింది. అధికారుల పనితీరుపై కూటమి ప్రజాప్రతినిధులే ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరి మధ్య సమన్వయలోపంతో అడుగడుగునా అసహనానికి గురయ్యారు. అధికారులపై మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాన్ని చెప్పకనే చెప్పారు.

- డీఆర్‌సీ సమావేశం సాక్షిగా బయటపడిన లుకలుకలు
- అధికారులు – ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయ లోపం
- ప్రభుత్వ లక్ష్యాలను పట్టించుకోవడం లేదు..
- అధికారులపై ప్రజాప్రతినిధుల అసహనం
- ఎన్‌ఆర్‌ఈజీఎస్ వర్కులకు ప్రొసీడింగ్స్ ఇప్పించకపోవడంపై ఎంపీ మాగుంట అసంతృప్తి
- గ్రీవెన్స్ అర్జీల పెండింగ్‌పై కలెక్టర్‌ను ప్రశ్నించిన మార్కాపురం ఎమ్మెల్యే కందుల
- వైద్యారోగ్య శాఖాధికారులపై ఇన్‌చార్జ్ మంత్రి ఆనం ధ్వజం
- అమృత్ పథకం పనులు పూర్తి చేయాలన్న దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి
- వై.పాలెం నియోజకవర్గంలో అక్రమాలపై ఆగ్రహించిన ఎమ్మెల్యే తాటిపర్తి

ఒంగోలు సబర్బన్:

జిల్లా సమీక్ష కమిటీ సమావేశంలో అధికార టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యేలు తీవ్రస్థాయిలో అసహనం వ్యక్తం చేశారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, రాష్ట్ర దేవదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధ్యక్షతన సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ సమావేశంలో అధికారుల తీరుపై చిందులు తొక్కారు. పైన పటారం.. లోన లొటారం అన్న చందంగా నడుస్తున్న కూటమి ప్రభుత్వ పాలనను టీడీపీ ప్రజాప్రతినిధులే ఎండగట్టడం సర్వత్రా చర్చనీయాంశమైంది.

మండిపడిన మాగుంట...

సీఎంతో మాట్లాడి జిల్లాకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ వర్కులు తీసుకొస్తే కనీసం ఎంపీడీవోలతో మాట్లాడి ప్రొసీడింగ్స్ కూడా ఇప్పించలేని పరిస్థితిలో జిల్లా అధికార యంత్రాంగం ఉందని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి సమావేశంలో ధ్వజమెత్తారు. దీనిపై ప్రివిలేజ్ కమిటీకి ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. అధికారుల తీరుపై తీవ్రంగా మండిపడ్డారు. సమీక్ష సమావేశాల్లో చర్చించిన అంశాలను కూడా పూర్తి చేయడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు తీసుకొచ్చినా జిల్లా అధికారులు స్పందించడం లేదంటే ఏమనుకోవాలన్నారు.

వైద్యారోగ్య శాఖాధికారుల తీరుపై అసహనం...

పలువురు టీడీపీ ఎమ్మెల్యేలు మంచినీటి సమస్యపై, వైద్యారోగ్య శాఖాధికారుల తీరుపై తీవ్రంగా అసహనం వ్యక్తం చేశారు. ఒక సందర్భంలో వైద్యారోగ్య శాఖ అధికారులపై సభ్యులందరూ అసంతృప్తి చెందడంతో ఆ శాఖపై 24 గంటల్లో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి తనకు నివేదిక ఇవ్వాలని కలెక్టర్ తమీమ్ అన్సారియాను ఇన్‌చార్జ్ మంత్రి ఆనం ఆదేశించారు. దీనిపై అవసరమైతే ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడతానని గట్టిగా చెప్పారు. తొలుత ఉపాధి హామీ పథకం ద్వారా అమలవుతున్న పనుల పురోగతిపై చర్చించారు. జిల్లాలోని 17 మండలాల్లో కరువు ఉందని అధికారులు నివేదికలు ఇచ్చారని, ఆ ప్రాంతాలతో పాటు మిగతా ప్రాంతాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి సమగ్ర ప్రణాళికతో జిల్లా యంత్రాంగం ముందుకు సాగాలని ఆదేశించారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి మాట్లాడుతూ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.

విచారణ పేరుతో కాలయాపన చేస్తున్నారంటూ ధ్వజం...

గ్రీవెన్స్‌లో వచ్చిన అర్జీలను 93 శాతం పరిష్కరించామని కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలపగా, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కొన్ని అర్జీలు చూపిస్తూ.. ఇవన్నీ పరిష్కారం కాలేదని అన్నారు. అంటే ఇవి మీ దగ్గర నమోదు కాలేదా.. అని ప్రశ్నించారు. మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య కల్పించుకుని మాట్లాడుతూ సింగరాయకొండ మండలం మూలగుంటపాడులో ఒక సర్వే నంబర్ కోసం మొత్తం రిజిస్ట్రేషన్లు ఆపేశారని, ఎన్నిసార్లు అర్జీలిచ్చినా పరిష్కారం కాలేదని అన్నారు. విచారణ పేరుతో కాలయాపన చేస్తున్నారన్నారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ జిల్లాలో ప్రాధాన్యత క్రమంలో ఉపాధి హామీ పథకం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. డీఆర్‌సీ సమావేశంలో ప్రజాప్రతినిధులు చర్చించిన అంశాలను పరిగణలోకి తీసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. తొలుత ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా దేశం కోసం ప్రాణాలర్పించిన వీర జవాన్‌లకు నివాళులర్పిస్తూ మంత్రులు, అధికారులు, ప్రజాప్రతినిధులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. సమావేశంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు, మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్‌రావు, కందుల నారాయణరెడ్డి, డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, బీఎన్ విజయకుమార్, ఇంటూరి నాగేశ్వరరావు, ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ నూకసాని బాలాజీ, ఏపీ స్టేట్ అగ్రికల్చర్ మిషన్ చైర్మన్ మారెడ్డి శ్రీనివాసులరెడ్డి, ఏపీ మాల వెల్ఫేర్ కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పి.విజయకుమార్, జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, మార్కాపురం సబ్ కలెక్టర్ సహదీత్ వెంకట త్రివినాగ్, జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం, పక్కన మంత్రి డోలా, కలెక్టర్ తమీమ్ అన్సారియా, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, జేసీ

ఆర్థోపెడిక్ లేక మరణాలు సంభవిస్తున్నాయి

- డీఆర్‌సీ సమావేశంలో యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



యర్రగొండపాలెం నియోజకవర్గ కేంద్రంలోని 100 పడకల వైద్యశాలలో ఆర్థోపెడిక్ డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో ప్రమాదాలకు గురైన వారు మరణిస్తున్నారు. ఆర్థోపెడిక్ డాక్టర్ గిద్దలూరు నుంచి వస్తారు. ఎప్పుడు వస్తారో తెలియదు. ఎప్పుడు వెళ్తారో తెలియదు. ఇటీవల రోడ్డు ప్రమాదాలకు గురై వైద్యశాలకు వస్తే ఆర్థోపెడిక్ డాక్టర్ లేక రక్తం పోకుండా ఆపి కట్టుకట్టేవారు కూడా లేక నరసరావుపేట వైద్యశాలకు వెళ్లేలోపు ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. గురిజేపల్లికి చెందిన వెన్నా వెంకటేశ్వరరెడ్డి, ఫారిన్ వెళ్లాల్సిన తొమ్మండ్రు దిలీప్ కుమార్, మూడు రోజుల క్రితం ఒక కానిస్టేబుల్ ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఇకపోతే, మంచినీటి సమస్య తీవ్రంగా ఉంటే వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మంచినీరు తోలిన ట్యాంకర్లకు ఇంత వరకు డబ్బు చెల్లించలేదు. రూ.13 కోట్ల బకాయిలున్నాయి. తీవ్ర కరువు కాటకాలతో ఉన్న యర్రగొండపాలేన్ని అధికారులు తీవ్రంగా విస్మరిస్తున్నారు. ఉపాధి హామీ పథకంలో వారానికి రూ.3 కోట్లు దండుకుంటున్నారు. టీడీపీ నాయకులు, అధికారులు పంచుకుంటున్నారు. రైతుల కోసం నిర్మిస్తున్న తొట్లు, షెడ్లలో పెద్ద ఎత్తున అవినీతి చోటుచేసుకుంటోంది. నియోజకవర్గంలో తాగునీటి సమస్య ఎక్కువగా ఉంది. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో సర్పంచుల తీర్మానాలు లేకుండా ఉపాధి పనులు చేపట్టారు. గతంలో ప్రజల తాగునీటి అవసరాలకు నీటిని రవాణా చేశారు. వాటికి సంబంధించిన బిల్లులు వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలి.

సమస్యలపై కాలయాపన తగదు

- యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు శ్రీనివాసరావు
- సర్దుబాటు ప్రక్రియపై ఉపాధ్యాయుల ఆందోళన

ఒంగోలు సిటీ: పాఠశాల విద్యాశాఖ చేపడుతున్న పునర్వ్యవస్థీకరణ ప్రక్రియతో పాటు ఏ విధమైన స్పష్టమైన జీవోలు లేకుండానే రోజుకో ఆలోచనతో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ చేపట్టడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావు అన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఒంగోలులోని కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ధర్నా శిబిరాన్ని ప్రారంభించిన కొమ్మోజు శ్రీనివాసరావు మాట్లాడుతూ వారం వారం గుర్తింపు కలిగిన ఉపాధ్యాయ సంఘాలతో నిర్వహిస్తున్న సమావేశాల దృష్టికి సమస్యలు తెస్తున్నప్పటికీ అవి పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. ఉపాధ్యాయుల్లో చెలరేగుతున్న ఆందోళన నేపథ్యంలో సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. జీవో నంబర్ 117ను రద్దు చేసి దాని స్థానంలో కొత్త జీవో విడుదల చేసి దాని ఆధారంగా మాత్రమే పాఠశాలలను పునర్వ్యవస్థీకరించాలన్నారు. అన్ని ప్రాథమిక పాఠశాలల్లో 1:20 నిష్పత్తి ప్రకారం ఉపాధ్యాయులను నియమించాలన్నారు. అన్ని మోడల్ ప్రైమరీ స్కూళ్లలో 5 తరగతులు బోధించడానికి ఐదుగురు టీచర్లను నియమించాలన్నారు. విద్యార్థుల సంఖ్య 75కు మించితే పీఎస్‌హెచ్‌ఎం పోస్టు అదనంగా కేటాయించాలని, అలాగే విద్యార్థుల సంఖ్య 120కి మించితే 6వ ఎస్‌జీటీ, ఆపైన ప్రతి 30 మందికి ఒక ఎస్‌జీటీ చొప్పున కేటాయించాలని అన్నారు. ఉర్దూ, మైనర్ మీడియం బోధించే ఉపాధ్యాయులను తెలుగు మీడియం ఎస్‌జీటీ/ఎస్‌ఏలతో కలిపి లెక్కించి పోస్టులు కేటాయించడం సరికాదన్నారు. ఆ పోస్టులు అదనంగా ఇవ్వాలన్నారు. అన్ని ప్రాథమికోన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు కేటాయించాలని, రెండు పోస్టులు కేటాయిస్తే ఒక లాంగ్వేజ్‌గా, రెండోది నాన్ లాంగ్వేజ్‌గా, 4 పోస్టులు కేటాయిస్తే రెండు లాంగ్వేజ్, రెండు నాన్ లాంగ్వేజ్ పోస్టులు కేటాయించాలని కోరారు. స్కూల్ అసిస్టెంట్ పోస్టుల స్థాయిని దిగజార్చవద్దని, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో మాత్రమే నియమించాలని అన్నారు. ఉన్నత పాఠశాలల్లో సమాంతర మీడియం కొనసాగించాలన్నారు.



ధర్నాలో పాల్గొన్న యూటీఎఫ్ నాయకులు

బదిలీల జీఓ తక్షణమే విడుదల చేయాలి...

యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ హై మాట్లాడుతూ బదిలీల జీఓ తక్షణమే విడుదల చేసి వేసవి సెలవుల్లో బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. బదిలీల ప్రక్రియకు ముందే ప్లస్ టూ హైస్కూళ్లలో ఇంటర్మీడియట్ తరగతులు బోధించడానికి అర్హులైన ఉపాధ్యాయులను నియమించాలన్నారు. ఎస్‌జీటీలకు మాన్యువల్ కౌన్సిలింగ్ ద్వారా బదిలీల ప్రక్రియ చేపట్టాలన్నారు. స్కూల్ అసిస్టెంట్ (స్పెషల్ ఎడ్యుకేషన్) టీచర్లకు బదిలీల్లో కొత్తగా మంజూరు చేసిన పోస్టులు ఖాళీలుగా చూపాలన్నారు. మున్సిపల్ పాఠశాలల్లో అప్‌గ్రెడేషన్ ప్రక్రియ సత్వరమే చేపట్టి ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. స్కూల్ అసిస్టెంట్ (లాంగ్వేజస్) పోస్టుల్లో హైకోర్టు తీర్పు అమలు చేసిన తర్వాత మిగిలిన పోస్టుల్లో లాంగ్వేజ్ పండితులు లభ్యం కానప్పుడు అర్హులైన ఎస్‌జీటీలకు ప్రమోషన్ ఇచ్చేందుకు తగిన చర్యలు చేపట్టాలని, అలాగే స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్) పోస్టుల్లో కూడా అర్హులైన ఎస్‌జీటీలకు ప్రమోషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యలను సత్వరమే పరిష్కరించకుంటే జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఆందోళన, నిరసన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వీరాంజనేయులు, సహాధ్యక్షుడు ఐవీ రామిరెడ్డి, సహాధ్యక్షురాలు జి.ఉమామహేశ్వరి, జిల్లా కోశాధికారి ఎస్.చిన్నస్వామి, జిల్లా కార్యదర్శులు డి.రాజశేఖర్, పి.వెంకటేశ్వర్లు, ఎం.శ్రీను, టి.రమణారెడ్డి, సీహెచ్ ప్రభాకర్‌రెడ్డి, పి.బాలవెంకటేశ్వర్లు, ఎం.రాము, రాష్ట్ర కౌన్సిలర్లు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ఆడిట్ కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

ఏ అర్హత ఉందని..

- డీఆర్‌సీలో గొట్టిపాటి లక్ష్మి, ఎరిక్షన్‌బాబు పాల్గొనడంపై విమర్శలు

డీఆర్‌సీలో టీడీపీ దర్శి ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మి, యర్రగొండపాలెం ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు పాల్గొన్నారు. వారు ఏ హోదాలో జిల్లా సమీక్ష కమిటీ సమావేశంలో పాల్గొన్నారంటూ పలువురు విమర్శిస్తున్నారు. వారికి ప్రభుత్వానికి సంబంధించిన పదవులేమీ లేవు. కానీ, డీఆర్‌సీలో పాల్గొని ప్రజాప్రతినిధుల మాదిరిగా వ్యవహరిస్తూ.. ప్రతిపక్ష వైఎస్సార్ సీపీ సభ్యులు ప్రజల సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొస్తుంటే కౌంటర్లు వేయడం.. దీనిపై ఇన్‌చార్జ్ మంత్రి కూడా వారించకపోవడం పెద్దఎత్తున చర్చనీయాంశంగా మారింది.



ఎలాంటి అర్హత లేకుండా డీఆర్‌సీ సమావేశంలో పాల్గొన్న గొట్టిపాటి లక్ష్మి, ఎరిక్షన్‌బాబు

తాగునీటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలి



దర్శి నియోజకవర్గ పరిధిలో ప్రజలు తాగునీటికి ఇబ్బంది లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. అమృత్ పథకం కింద చేపట్టిన పనులు పూర్తి చేయాలి. ఇన్‌చార్జి మంత్రి ఆ దిశగా దృష్టి సారించాలి.

– డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, దర్శి ఎమ్మెల్యే

పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలి



ఈ సంవత్సరం అన్ని పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రైతాంగాన్ని ఆదుకోవాల్సిన అవసరం ఉంది. పొగాకు రైతులు తీవ్ర నష్టాలపాలవుతున్నారు. మిర్చి రైతులను కూడా ఆదుకోవాలి.

– తూమాటి మాధవరావు, ఎమ్మెల్సీ

క్లుప్తంగా

పాలకుల తీరుతో పాఠశాలల ఉనికికే ప్రమాదం

- ఏపీటీఎఫ్ నాయకులు
- 14న విజయవాడలో ధర్నాకు తరలిరావాలని పిలుపు

ఒంగోలు సిటీ: ప్రభుత్వ పాఠశాలల మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్న పాలకుల విధానాలను ప్రతిఘటిస్తూ ఏపీటీఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు మూడు దశల కార్యాచరణలో భాగంగా విజయవాడ ధర్నా చౌక్‌లో ఈ నెల 14వ తేదీన తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.జనార్దనరెడ్డి, వి.శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ కోసం విజయవాడలో నిర్వహిస్తున్న ధర్నాకు జిల్లా నుంచి ఎక్కువ మంది కార్యకర్తలు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్య

మార్కాపురం: కుటుంబ కలహాలతో ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మార్కాపురం మండలం పెద్దనాగులవరం గ్రామంలో చోటుచేసుకుంది. మార్కాపురం రూరల్ ఎస్సై అంకమరావు కథనం మేరకు.. గ్రామానికి చెందిన తురక శివ(24) కుటుంబ కలహాల నేపథ్యంలో ఆదివారం రాత్రి పొద్దుపోయిన తర్వాత ఇంట్లో ఉరివేసుకున్నాడు. సోమవారం ఉదయం తండ్రి తిరుపతయ్య ఇంట్లోకి వెళ్లి చూడగా కుమారుడు ఉరికి వేలాడుతున్నాడు. పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా మృతుడు పట్టణంలోని కంభం రోడ్డులో ఒక ప్రైవేట్ వైద్యశాలలో ల్యాబ్‌టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఆరు నెలల క్రితమే రంగలక్ష్మి అనే యువతితో వివాహమైంది. కుమారుడి మృతితో తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు.



ఆవేదనతో పొగాకును తగలబెడుతున్న రైతులు

కంపెనీల దురాగతం.. బర్లీ రైతులకు ధరాఘాతం

బర్లీ పొగాకు కొనే వారేరి?

- పేరుకు పోయిన నిల్వలు
- దిక్కుతోచని స్థితిలో రైతులు
- కౌలు రైతుల పరిస్థితి మరీ దుర్భరం

నాగులుప్పలపాడు: బర్లీ పొగాకు సాగు చేసిన రైతుల్లో ఆత్మస్థైర్యం సన్నగిల్లుతోంది. ధర దారుణంగా పతనం కావడంతో రైతులు ఏం చేయాలో దిక్కు తోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. కనీసం పెట్టుబడి ఖర్చులు చేతికొస్తే చాలని దీనంగా ఎదురుచూస్తున్నారు. అయితే పుండు మీద కారం చల్లినట్టుగా పొగాకు కొనుగోళ్లకు వ్యాపారులు ముందుకురావడం లేదు. ×మా కంపెనీ నారుతో పంట సాగు చేయండి.. కొనే బాధ్యత మాది৷ అని జీపీఐతో పాటు మరికొన్ని కంపెనీ ప్రతినిధులు చెప్పిన మాటలు నమ్మి జిల్లాలో రైతులు నిలువునా మోసపోయారు. తీరా పంట చేతికొచ్చాక నాణ్యత లేదంటూ ధర తెగ్గోయడంతో రైతులు దిక్కు తోచని స్థితిలో పడిపోయారు. వేలం ప్రారంభమైన తొలినాళ్లలో క్వింటా పొగాకు రూ.8 వేల నుంచి రూ.12 వేలకు కొనుగోలు చేసిన కంపెనీలు.. ఆ సొమ్మును నారు, పట్టలు, ఇతర సామగ్రి కింద జమ వేసుకోవడం గమనార్హం.

సర్కారు చొరవ శూన్యం

ఈ ఏడాది జిల్లాలో సుమారు 80 వేల ఎకరాల్లో బర్లీ పొగాకు సాగు చేశారు. ఎకరాకు రూ.1.50 లక్షల వరకు పెట్టుబడి పెట్టి పొగాకు పండించినా సరైన దిగుబడి రాలేదు. అదే సమయంలో కనీస గిట్టుబాటు ధర ఇవ్వకపోవడంతో కొనుగోళ్ల మందగించాయి. గత ఏడాది తొలి విరుపులో అడుగాకు సైతం క్వింటా రూ.8 నుంచి రూ.10 వేలు పలికింది. మలి విరుపులో క్వింటా రూ.15 వేల నుంచి రూ.18 వేలకు కొనుగోలు చేశారు. ఈ ఏడాది క్వింటా మలి విరుపు ఆకు రూ.10 వేలు కూడా పలకడం లేదు. ప్రైవేట్ కంపెనీలు పొగాకు కొనుగోలుకు ముందుకు రాకపోతే టుబాకో బోర్డు ఆధ్వర్యంలో ప్రభుత్వం పొగాకు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సుమారు రూ.500 కోట్లు ప్రత్యేక నిధి కేటాయించి మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి కొనుగోలు చేశారు. బర్లీ పొగాకు రైతుల ఆందోళనల నేపథ్యంలో ప్రభుత్వం తరఫున కొనుగోలు చేస్తామని ఇరవై రోజుల క్రితం వ్యవసాయ శాఖ మంత్రి ప్రకటించినా నేటికీ ఆ దిశగా తీసుకున్న చర్యలు శూన్యం.

కోలుకోవడం కష్టమే..

తొలి వలుపులో ఓ రకంగా ధర చెల్లించిన రైతులు రెండో వలుపు వచ్చేసరికి నాణ్యత సాకు చూపి చేతులెత్తేశారు. వేలంలో పాల్గొనకుండా పత్తా లేకుండా పోయిన కంపెనీల ప్రతినిధులు ఫోన్లు సైతం స్విచాఫ్ చేసుకున్నారు. మూడు నెలలుగా రైతులు ఎన్ని విధాలుగా ప్రయత్నాలు చేసినా బర్లీ పొగాకు కొనేందుకు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో పెట్టుబడి కోసం భారీగా అప్పు చేసిన రైతుల్లో కలవరం మొదలైంది. దిక్కుతోచని స్థితిలో రైతులు పొగాకును తగలబెట్టడంతోపాటు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. పత్తి, మిరప సాగులో నష్టాలు చవిచూసిన రైతులు పొగాకు కంపెనీల మాటలు నమ్మి బర్లీ సాగు చేసి దగాపడ్డారు. ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు కౌలు చెల్లించి పొగాకు సాగు చేసిన రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

రంగు మారే ప్రమాదం

పొగాకు రెలిచి రెండు నెలలకు పైగా అయింది. వేసవిలో ఎండలు ఎక్కువ కావడంతో ఆకు పొడైపోతోంది. ప్రతి 15 రోజులకు ఒకసారి బేళ్లు ఆరబెట్టాలి, ఆకును తిరగేయాలి లేదంటే లోపలకు గాలి చేరి ఆకు కుళ్లిపోయి రంగు మారే ప్రమాదం ఉంది. ఈ ప్రక్రియ మొత్తం రైతులకు ప్రహసనంగా మారింది. ఈ నేపథ్యంలో గిట్టుబాటు ధర దక్కేలా చర్యలు తీసుకోవాలని పొగాకు రైతులు కోరుతున్నారు.


జీపీఐ కంపెనీ మోసాన్ని గ్రహించలేకపోయాం



15 ఎకరాల్లో తెల్ల బర్లీ పొగాకు సాగు చేశా. ఇప్పటికే కౌలు, కూలీలకు రూ.లక్షల్లో ఖర్చు చేశా. మొదట్లో జీపీఐ కంపెనీ ప్రతినిధులు పొగాకు కొంటామని మాయమాటలు చెప్పి సాగు చేయించారు. తీరా పంట చేతికొచ్చాక కొద్ది మేర కొనుగోలు చేసి పత్తా లేకుండా పోయారు. లక్షల రూపాయల విలువైన పొగాకు పొలాల్లోనే ఉండిపోయింది. తెచ్చిన అప్పులతోపాటు కూలీలకు డబ్బు ఎలా ఇవ్వాలో అర్థం కావడం లేదు. ఇంతలా మోసం చేస్తారని గ్రహించలేకపోయాం.

– పాలపర్తి సతీష్, పొగాకు రైతు, కండ్లగుంట

రైతులతో కలిసి ఉద్యమిస్తాం



మిగతా పంటలకు సరైన మద్దతు ధర లేకపోవడంతో వర్జీనియాతోపాటు బర్లీ పొగాకును రైతులు అధికంగా సాగు చేశారు. తీరా పంట చేతికొచ్చాక కంపెనీలు నిలువునా మోసం చేస్తున్నాయి. పొగాకు రైతులు ఆందోళనకు దిగుతున్నా, ఆత్మహత్యలకు పాల్పడుతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదు. కంపెనీలు మద్దతు ధర ఇవ్వకపోగా, పత్తాలేకుండా పోవడం ప్రభుత్వ వైఫల్యమే. గతంలో పొగాకు కంపెనీలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయించారు. కంపెనీలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పొగాకు కొనుగోలు చేసేలా ఒత్తిడి తెచ్చారు. కూటమి ప్రభుత్వం అదే చొరవ చూపాలి. లేదంటే రైతులతో కలిసి ఉద్యమిస్తాం.

– మేరుగు నాగార్జున, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు ఇన్‌చార్జి



ఆరబెట్టిన బర్లీ పొగాకు



కొనుగోలు చేయకపోవడంతో మండెలు వేసిన రైతులు

నారాయణస్వామి ఆలయానికి రూ.11 లక్షల ఆదాయం

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయానికి వస్తు వేలం ద్వారా రు.11 లక్షల ఆదాయం సమకూరినట్లు ఈఓ డి.వంశీకృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం ఆలయ కమిటీ చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ ఆధ్వర్యంలో భక్తులు కానుకగా సమర్పించిన ఇత్తడి గంటలు, ఇతర వస్తువులకు బహిరంగ వేలం నిర్వహించారు. ఇత్తడికి కేజీ రూ..500, అల్యూమినియం కేజీ రూ.181, స్టీలు కేజీ రూ.34, పాత ఇనుము సామగ్రి కేజీ రూ.26, బియ్యం కేజీ రూ.26 చొప్పున ధర నిర్ణయించగా రూ.11 లక్షల ఆదాయం వచ్చిందని వివరించారు.

పట్టపగలే బంగారం చోరీ

కొండపి: ఓ మహిళ వద్ద పట్టపగలే బంగారం చోరీ చేసిన సంఘటన కొండపి ఆర్టీసీ బస్టాండ్‌లో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. తాళ్లూరు మండలం తూర్పు గంగవరం గ్రామానికి చెందిన గుట్లపల్లి కుమారి కందుకూరు వెళ్లేందుకు సంతనూతలపాడు మీదుగా కొండపి చేరుకుంది. బస్సు కోసం వేచి ఉన్న సమయంలో ఆమె తన కర్రల సంచి పక్కన పెట్టింది. సంచికి రంధ్రం వేసిన దొంగ.. హ్యాండ్ బ్యాగ్‌లో ఉన్న 15 సవర్ల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు అపహరించాడు. దీంతో కన్నీరుమున్నీరైన ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రేమ్‌కుమార్ తెలిపారు.



వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరిస్తున్న అన్నా, ఉడుముల

మళ్లీ మంచి రోజులొస్తాయి

- అధికారం ఉందని ఇష్టారీతిగా ప్రవర్తిస్తే సహించేది లేదు
- మాజీ ఎమ్మెల్యేలు అన్నా, ఉడుముల
- భారీ జన సందోహం మధ్య వెలిగండ్ల గ్రామంలో వైఎస్సార్ సీపీ జెండాల ఆవిష్కరణ



నాయకులకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

కొనకనమిట్ల: అధికారం చేతిలో ఉందని ఇష్టమొచ్చినట్లు వ్యవహరిస్తూ, వైఎస్సార్ సీపీ శ్రేణులను ఇబ్బంది పెట్టాలని చూస్తే చూస్తూ ఊరుకునేది లేదని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నా రాంబాబు హెచ్చరించారు. సోమవారం సాయంత్రం కొనకనమిట్ల మండలంలోని వెలిగండ్ల గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు గ్రామ సర్పంచ్ పాతకోట వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ స్థానిక ఎంపీటీసీ మెట్టు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో రెండు చోట్ల ఏర్పాటు చేసిన పార్టీ జెండాలను మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసరెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేలు అన్నా, ఉడుముల మాట్లాడుతూ.. అధికారాన్ని అడ్డం పెట్టుకుని నీచమైన పనులు చేస్తే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా ఒక్క పథకం కూడా అమలు చేసిన పాపాన పోలేదని విమర్శించారు. వైఎస్సార్ సీపీ హయాంలో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిందని గుర్తు చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో మళ్లీ మంచి రోజులొస్తాయని, కార్యకర్తలు, నాయకులు అధైర్య పడొద్దని భరోసా ఇచ్చారు. కూటమి నాయకుల ఒత్తిడితో అధికారులు వైఎస్సార్ సీపీ జెండాను తొలగించగా.. రెట్టింపు ఉత్సాహంతో రెండు చోట్ల జెండాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. జెండాల ఆవిష్కరణకు హాజరైన మాజీ ఎమ్మెల్యేలకు గ్రామ నాయకులతో పాటు ఎస్సీ కాలనీ వాసులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, మండల పార్టీ కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ గొంగటి జెనీఫా కరుణయ్య, పార్టీ మాజీ మండల కన్వీనర్ రాచమళ్ల వెంకటరామిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఉన్నం శ్రీనివాసులు, విద్యార్థి విభాగం నియోజకవర్గ కన్వీనర్ ఏలూరి సంజీవరెడ్డి, పలు గ్రామాల సర్పంచ్‌లు పార్లపల్లి సిద్దానభి, పాలూరి లక్ష్మిసాంబ వెంకటేశ్వర్లు, గొలమారి భవాని తిరుపతిరెడ్డి, పిన్నిక పిచ్చయ్య, బేతా ధనలక్ష్మి ప్రకాష్ రెడ్డి, ఎంపీటీసీలు కోండ్రు వెంకటేశ్వర్లు, యూత్ నాయకులు గాడి కోనేటిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, తంగిరాల బ్రహ్మారెడ్డి, గర్రె శ్రీనివాసులు, చంద్రశేఖర్, కట్టా రమణయ్య, బసాపురం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన బైక్



వైద్యశాలలో చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ తిరుపతిరెడ్డి



క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలిస్తున్న ఎస్సై, స్థానికులు

- స్పెషల్ పార్టీ కానిస్టేబుల్‌కు తీవ్రగాయాలు
- క్షతగాత్రుడిని గుంటూరు తరలించిన పోలీసులు

కంభం: విధులకు హాజరయ్యేందుకు కంభం వెళ్తున్న ఓ కానిస్టేబుల్ బైక్ అదుపుతప్పి తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన సోమవారం తెల్లవారుజామున కంభం మండలంలోని పోరుమామిళ్లపల్లి గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. వివరాలు.. స్పెషల్ పార్టీ కానిస్టేబుల్ మాదిరెడ్డి తిరుపతిరెడ్డి సోమవారం ఉదయం కంభం అర్బన్ కాలనీలో కార్డన్ సెర్చ్‌లో పాల్గొనాల్సి ఉంది. ఈ క్రమంలో ఆదివారం రాత్రి తురిమెళ్ల గ్రామంలోని తన అత్తగారింట్లో ఉండి సోమవారం తెల్లవారుజామున బైక్‌పై కంభం బయలుదేరారు. ఈ క్రమంలో పోరుమామిళ్లపల్లి సమీపంలోని మూలమలుపు వద్ద బైక్ అదుపు తప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కానిస్టేబుల్ కుడి చేతి రెండు వేళ్లు విరిగిపోవడంతోపాటు తలకు తీవ్రగాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న వారు గమనించి 108 అంబులెన్స్‌కు ఫోన్ చేయగా వాహనం అందుబాటులో లేదు. ప్రమాద సమాచారం అందుకున్న కంభం సీఐ మల్లికార్జున, ఎస్సై నరసింహారావు సంఘటనా స్థలానికి చేరుకుని కానిస్టేబుల్ తిరుపత్తిరెడ్డిని కంభంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మార్కాపురంలోని ఓ ఆస్పత్రికి, అక్కడి నుంచి గుంటూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

ప్రలోభాల పర్వం.. ఆపై అవిశ్వాసం

- మార్కాపురం మున్సిపాలిటీలో పాగా వేసేందుకు టీడీపీ కుయుక్తి
- కౌన్సిలర్లను బెదిరించి పార్టీలో చేర్చుకున్న వైనం
- ఎమ్మెల్యే కందుల ఆధ్వర్యంలో కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మానం అందజేత

మార్కాపురం టౌన్: మార్కాపురం మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణపై టీడీపీ కౌన్సిలర్లు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో అవిశ్వాస తీర్మానాలతో కూడిన లేఖను కలెక్టర్ తమీమ్ అన్సారియాకు సోమవారం అందజేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మున్సిపల్ కౌన్సిల్‌ను తమ చేతుల్లోకి తీసుకునేందుకు చేసిన కుట్రలు ఫలించలేదు. మార్కాపురం పురపాలక సంఘంలో మొత్తం 35 వార్డులు ఉన్నాయి. మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున 30 మంది, టీడీపీ తరఫున ఐదుగురు కౌన్సిలర్లుగా గెలుపొందారు. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మున్సిపాలిటీపై పట్టు కోసం టీడీపీ నేతలు కుట్రలకు తెరదీశారు. దశల వారీగా వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లను ప్రలోభాలకు గురిచేయడంతోపాటు ఆర్థిక, సామాజిక బలహీనతలను అడ్డుపెట్టుకుని ఈ ఏడాది జనవరిలో 12 మంది కౌన్సిలర్లను టీడీపీలో చేర్చుకున్నారు. టీడీపీలో చేరేందుకు ససేమిరా అని చెప్పిన కౌన్సిలర్లను బెదిరింపులకు గురిచేశారు. ప్రస్తుతం మార్కాపురం మున్సిపాలిటీ వైఎస్సార్‌సీపీకి 17 మంది కౌన్సిలర్లు, టీడీపీకి 17 మంది కౌన్సిలర్లు ఉన్నారు. వైఎస్సార్ సీపీకి చెందిన కౌన్సిలర్ ఒకరు మృతి చెందడంతో కౌన్సిలర్ల సంఖ్య 34కు చేరింది. ప్రజాబలంతో గెలుపొందకుండా, అడ్డదారిలో మున్సిపల్ చైర్మన్ సీటు దక్కించుకునేందుకు అవిశ్వాసం ప్రకటించడం విడ్డూరంగా ఉందని రాజకీయ విశ్లేషకులు విమర్శిస్తున్నారు.

19 నుంచి టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

ఒంగోలు సిటీ: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 19 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు డీఈఓ ఎ.కిరణ్‌కుమార్ సోమవారం తెలిపారు. పరీక్షలకు జిల్లాలో 36 కేంద్రాలు ఏర్పాట్లు చేశామని, 4,283 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. పరీక్షలను పకడ్బందీగా, ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా నిర్వహించాలని సిబ్బందికి స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు.

బైకు అదుపుతప్పి ఒకరు మృతి

కురిచేడు: ద్విచక్ర వాహనం అదుపుతప్పి విద్యుత్ స్తంభానికి ఢీకొనడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందారు. ఈ సంఘటన సోమవారం కురిచేడు మండలంలోని వెంగాయపాలెం సమీపంలో చోటుచేసుకుంది. వివరాలు.. మండలంలోని ఆవులమంద గ్రామానికి చెందిన పల్లె డేవిడ్(40) తమ గ్రామంలోని చర్చికి విద్యుత్ దీపాలంకరణ చేస్తానని పని కుదుర్చుకున్నారు. ఈ క్రమంలో కొన్ని విద్యుత్ సీరియల్ లైట్లు తక్కువ కావడంతో తన బైక్‌పై వినుకొండ వెళ్లి కొనుగోలు చేశారు. తిరుగు ప్రయాణంలో వెంగాయపాలెం సమీపంలోకి వచ్చేసరికి బైక్ అదుపు తప్పడంతో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. డేవిడ్ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అదే మార్గంలో వెళ్తున్న వారు సమాచారం ఇవ్వడంతో బంధువులు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.శివ తెలిపారు. మృతునికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఆదివారం రాత్రి డేవిడ్ తన కుమార్తె మెచ్యూర్ ఫంక్షన్ నిర్వహించారని, మరునాడే ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.




ప్రమాదంలో మృతి చెందిన డేవిడ్



డేవిడ్ (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

పెద్దారవీడు: రోడ్డు దాటేందుకు పక్కన వేచిఉన్న మహిళను వేగంగా వెళ్తున్న బైక్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ సంఘటన పెద్దారవీడు మండలంలోని బోడిరెడ్డిపల్లి ఎంపీపీ పాఠశాల వద్ద సోమవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గంజి నారాయణమ్మ వీరభద్రస్వామి గుడిలో ఉత్సవానికి వెళ్లేందుకు ఇంటి నుంచి బయటకొచ్చింది. అదే సమయంలో హనుమాన్‌జంక్షన్ కుంట వైపు నుంచి లారీ వస్తుండటంతో రోడ్డు దాటకుండా పక్కన వేచిఉంది. జాతీయ రహదారిపై ఎంపీపీ పాఠశాల దగ్గర ఒక లారీకి రూ.50 రుసుం వసూలు చేసేందుకు ప్రభుత్వం చెక్ పోస్టు ఏర్పాటు చేసింది. అయితే చెక్‌పోస్టు వద్ద లారీ ఆపకుండా డ్రైవర్ వెళ్లిపోతుండటంతో అక్కడ విధులు నిర్వహిస్తున్న వ్యక్తి బైక్‌కు లైట్లు వేయకుండా లారీని వెంబడించాడు. ఈ క్రమంలో రోడ్డు పక్కన వేచి ఉన్న గంజి నారాయణమ్మ(50)ను బైక్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి భర్త నారాయణరెడ్డి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. నారాయణమ్మ మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



మృతి చెందిన నారాయణమ్మ